క్లుప్తంగా

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

కోదాడ : హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కోటగిరి వెంకటనారాయణ కోరారు. శనివారం పట్టణంలో జరిగిన కోదాడ కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కులను హరించే విధంగా పాలక ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరెడ్డి, మంద ఉపేందర్, ఉపాధ్యక్షుడిగా సిద్దెల రాంబాబు, సహాయ కార్యదర్శిగా మంద నాగయ్య, కోశాధికారిగా వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, ఏసోబు, శ్రీనివాస్, రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

మోతె : మండల కేంద్రంలోని డబల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటులో భాగంగా మండల కేంద్రంలోని డబల్ బెడ్‌రూం ఇళ్ల కాలనీలో సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నివసిస్తున్న పెద్దమ్మలోల్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

నేరేడుచర్ల : నేరేడుచర్లలో ఆధార్ అప్‌డేట్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆధార్‌అప్‌డేట్ సెంటర్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త, మాజీ సర్పంచ్ సుంకర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. శనివారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అవసరానికి ఆధార్ కార్డు ప్రమాణికంగా మారిందని, అప్‌డేట్ కోసం హుజూర్‌నగర్, మిర్యాలగూడకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

క్రీడా దుస్తులు అందజేత



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న మామిడి రామారావు

కోదాడరూరల్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లోనూ రాణించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మామిడి రామారావు అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికల టీంతో పాటు బాలుర టీంకు శనివారం ఆయన క్రీడా దుస్తులు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందు, పీఈటీ కొండలు, శేషగిరి, చందులాల్, సత్యనారాయణరెడ్డి, ఖలీల్‌అహ్మద్, గిరి, జ్యోతి, పిడతల శ్రీను, ఏడుకొండలు, నాగుల్, అబ్దుల్ రెహమాన్, రాయపూడి రమేష్, వరదచారి ఉన్నారు.

చిమిర్యాలలో..

చిమిర్యాల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రెండు రోజుల కిందట నిర్వహించిన ఎస్‌జీఫ్ క్రీడ పోటీల్లో అండర్– 17 బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను, పీఈటీ పి.కళ్యాణ్‌ను హెచ్‌ఎం.శరత్ బాబుతో పాటు ఏఏపీ కమిటీ చైర్మన్ లక్ష్మీబాలను అభినందించి సన్మానించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : సూర్యాపేటలో అక్టోబర్ మొదటి వారంలో నిర్వహించబోయే సీఐటీయూ జిల్లా నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, సోమయ్య, శీలం శ్రీను, రాధాకృష్ణ, బాలాజీ, రేణుక, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి

హుజూర్‌నగర్ : ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డీవైఎఫ్ఐ డివిజన్ మాజీ అధ్యక్షుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మురళి, అనిల్, వీరబాబు, నరేష్, అబ్రహం, శంకర్ పాల్గొన్నారు.

గణపయ్యా.. వెళ్లి రావయ్యా

వినాయక చవితి నవరాత్రోత్సవాలు ముగిశాయి. శనివారం రెండవరోజు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో గణనాథుల నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, మేళతాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ ఏకదంతుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణానదితో పాటు చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ముందుగా విఘ్నేశ్వరుడికి పూజలు చేశారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మునగాల : వినాయకుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న రెడ్డినగర్ గణేష్ యూత్ కమిటీ సభ్యులు



కోదాడ : ఖమ్మం క్రాస్‌రోడ్డు నుంచి విగ్రహాలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు



మఠంపల్లి : మంచ్యాతండాలో..



నడిగూడెం : రామాపురంలో పూజలో భక్తులు



నేరేడుచర్లలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కోదాడ : వినాయకుడి శోభాయాత్రకు సిద్ధమైన నయానగర్ భక్తులు



నడిగూడెం : వెంకట్రాంపురంలో అన్నదానం చేస్తున్న మహేష్‌రెడ్డి



మోతె : రావిపహాడ్‌లో..



మఠంపల్లి కామంచికుంటతండాలో అన్నదానం చేస్తున్న మాజీసర్పంచ్ సునీతాలాలునాయక్

వేలంలో భారీ ధర పలికిన గణపతి లడ్డూ



కోదాడ : వేలంలో లడ్డూను దక్కించుకున్న లక్ష్మీసాయి లారీ సప్లయ్ ఆఫీస్ నిర్వాహకులు

కోదాడ : పట్టణంలోని కాన్వాసింగ్ ఏజెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం గణపతి లడ్డూ వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా జరిగిన ఈ వేలం పాటలో చివరకు లక్ష్మీసాయి లారీ సప్లయ్ ఆఫీస్ నిర్వాహకుడు చింతల లింగయ్య బృందం రూ. 3,51,557కు లడ్డూను కై వసం చేసుకుంది. లడ్డూను దక్కించుకున్న లింగయ్య బృందాన్ని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో చింతల శ్రీను, వెంపటి మధు, గట్ల కోటేశ్వరరావు, హనుమంతరావు, చాప గోవిందరావు, గడ్డం రాంబాబు, ఓరుగంటి శ్రీనివాసరావు, బద్రీష్, నాగేశ్వరరావు, పర్వతాలు, గుడుగుంట్ల రఘు, గుడుగుంట్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో లడ్డూ రూ.50,016

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద తొమ్మిది రోజులు పూజలందుకున్న లడ్డూ వేల పాట శనివారం నిర్వహించారు. ఈ వేలం పాటలో వంగాల రవీంద్రాచారి రూ.50,016కు లడ్డూను కై వసం చేసుకున్నారు. వెండి గణపతి ప్రతిమను నవీన్, జహ్నవి దంపతులు రూ.50, 516కు దక్కించుకున్నారు. అనంతరం విఘ్నేశ్వరుడిని మేళతాళాలతో మహిళల నృత్య ప్రదర్శన, కోలాటల నడుమ వైభవంగా నిమజ్జనానికి తరలించారు.

రెడ్డినగర్‌లో లడ్డూ రూ.69 వేలు

మునగాల : మండల కేంద్రంలోని రెడ్డినగర్‌లో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపం వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన లడ్డూ వేలం పాటకు మంచి స్పందన లభించింది. గ్రామానికి చెందిన రెడ్డిజన సంఘం అధ్యక్షుడు ఉప్పుల జానకిరెడ్డి 50 కేజీల లడ్డూను రూ.69 వేలకు దక్కించుకున్నాడు.

యూరియా కోసం ఎగబడిన రైతులు



చిలుకూరు : దూదియాతండా పంచాయతీ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు



నడిగూడెం : తెల్లబల్లి సహకార సంఘం వద్ద రైతులు

నడిగూడెం : నడిగూడెం, తెల్లబల్లి సహకార సంఘాల వద్ద శనివారం ఉదయం నుంచి పంపిణీ చేసిన యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. నడిగూడేనికి 220, తెల్లబల్లికి 220 యూరియా బస్తాలు పంపిణీ చేశారు. తెల్లబల్లి సహకార సంఘంలో రైతులు ఎగబడడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో రెండు ఎకరాలలోపు రైతులకు ఒకటి, ఐదు ఎకరాల వారికి రెండు బస్తాల చొప్పున యూరియాను పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు.

గంటల తరబడి నిరీక్షణ..

చిలుకూరు : చిలుకూరు పీఏసీఎస్ పరిధిలోని దూదియాతండా గోదాముకు శనివారం యూరియా రావడంతో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంపిణీ చేశారు. దీంతో రైతులు ఉదయం 6 గంటలకే పట్టాదారు పాస్‌బుక్కులు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్యూలో పెట్టి బారులుదీరారు. గంటల తరబడి నిలబడితే కట్ట యూరియా లభించింది. దొరకని వారు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

తెల్లవారుజామునుంచే పడిగాపులు

మఠంపల్లి: మఠంపల్లిలోని పీఏసీఎస్ గోదాం వద్ద యూరియా కోసం శనివారం తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలైన్‌లో కూర్చుని పడిగాపులు కాశారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా ఇవ్వడంతో అందరికీ సరిపడా ఇవ్వాలని కోరారు.

ఎండలో నిలబడలేక..

పాలకవీడు: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌కు 400 బస్తాల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు శనివారం తెల్లవారుజాము నుంచే క్యూకట్టారు. ఎండ తీవ్రతకు నిలబడలేక క్యూలైన్‌లో చెప్పులు పెట్టి యూరియా కోసం ఎదురు చూశారు. ఎండలో నిల్చున్న రైతులకు బీఆర్ఎస్ నాయకులు వాటర్ బాటిళ్ల అందించారు. ఒక్కో బస్తాచొప్పున పంపిణీ చేశారు.



పాలకవీడులో చెప్పులు క్యూలైన్‌లో పెట్టి నిరీక్షిస్తున్న రైతులు



మఠంపల్లిలోని గోదాం వద్ద నిరీక్షిస్తున్న రైతులు, మహిళలు

విలువలతో కూడిన విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ సోమిరెడ్డి

హుజూర్‌నగర్ : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్ సోమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కరక్కాయలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీదేవి ఫౌండేషన్ దశమ వార్షికోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సామాజిక బాధ్యత కలిగి ఉండటంతో పాటు పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం స్థానిక ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎంఈఓ సైదానాయక్, పీఏసీఎస్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, రిటైర్డు ఉద్యోగులు దేవదానం, అంకతి అప్పయ్య, పారుపల్లి చంద్రశేఖర్, కేవీఎన్ మూర్తి, ధర్మోరి వెంకటేశ్వర్లు, ఎస్ఎన్ రాజు, గోపతి గోపయ్య, చంద్రయ్య, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారావుకు నివాళి

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామ పంచాయతీలో మల్టీ పర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న మొలుగూరి నర్సింహారావు (38) ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. శనివారం గ్రామంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపమ్మ పాల్గొని నర్సింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, మల్టీ పర్పస్ వర్కర్ల సంఘం మండల అధ్యక్షుడు షేక్ సుభాని, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, గ్రామ మాజీ సర్పంచ్‌లు పగడాల పద్మ, రామిని విజయ్‌వర్ధన్ రెడ్డి, పసుపులేటి వినయ్‌వర్ధన్‌బాబు, సోమగాని రవి, పోలంపల్లి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన శ్రీనివాసరావు, జొన్నలగడ్డ వీరగోవిందు, రామిని సైదిరెడ్డి, మొలుగూరి ఉపేందర్ పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధి.. పాత్రికేయులు



పాత్రికేయులను సన్మానిస్తున్న వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు

హుజూర్‌నగర్ : ప్రజలకు ప్రభుత్వానికి పాత్రికేయులు వారధులని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి సత్రంలో జరిగిన కార్యక్రమంలో హుజూర్‌నగర్ వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ లెజెండ్ ఆధ్వర్యంలో స్థానిక విలేకరులను శాలువాలతో సన్మానించి మాట్లాడారు. సంఘ నాయకులు పి.అశోక్, బి.రామారావు, కే.పాపారావు, వి.వెంకటేశ్వర్లు, పి.ఝాన్సీరాణి, ప్రవళిక హరీష్, పి.నరసింహారావు, వి.నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, కొండలరావు, మురళి, నాని, స్వామి, గోపి, సతీష్, స్వామి, గోపి, గణేష్, శ్రీను, శ్రీమన్నారాయణ, చంద్రం, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం కోదాడకు చెందిన ఓరుగంటి జ్యూయలర్స్ యజమాని ఓరుగంటి నవీన్- అనిత దంపతుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పురోహితులు కందాళ శ్రీనివాసాచార్యులు, దేవాలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో సమస్యలపై మాట్లాడుతున్న శ్రీరాములు

మునగాల : మండలంలోని తాడువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వి.ఇందిర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. పాలకవర్గం, సిబ్బందిపై పలువురు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొసైటీలో సిబ్బంది రూ.లక్షల అవినీతికి పాల్పడినప్పటికీ పాలకవర్గం పట్టించుకోలేదని రైతు సంఘం జిల్లా నాయకుడు బుర్రి శ్రీరాములు ఆరోపించారు. యూరియా సరఫరాలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సొసైటీలోని 13 గ్రామాల పరిధిలో మూడు కేంద్రాలను ఏర్పాటు చేసి యూరియాను రైతులకు సరఫరా చేయాలని కోరారు. సొసైటీలో జరిగిన అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలకవర్గం రద్దుపై జిల్లా అధికారులు పునరాలోచన చేయాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు కోల ఉపేందర్, సుంకర్ అజయ్‌కుమార్ కోరారు. రైతాంగానికి సరిపడా యూరియా అందజేయాలని పలువురు సభ్యులు అధికారులపై ఒత్తిడి చేశారు. సమావేశంలో ఇంచార్జి కార్యదర్శి చందా ప్రవీణ్‌రెడ్డి, సభ్యుడు వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



నేరేడుచర్ల : ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి

కోదాడరూరల్ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటరు, పోలింగ్ కేంద్రాల జాబితాలపై సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇస్సాక్ హుస్సేన్ తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల లిస్టును ప్రదర్శించి మాట్లాడారు. జాబితాలపై అభ్యంతరాలుంటే తెలియాలన్నారు. సిబ్బంది ఉన్నారు.

మోతెలో..


మోతె : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాలను శనివారం మోతె మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఆంజనేయులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబితాలపై ఈ నెల 11వ తేదీన మండల కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబితాలపై అభ్యంతరాలను చర్చించనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ముసాయిదా ఓటరు జాబితాను శనివారం ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి మొత్తం 42 పోలింగ్ బూత్‌లుండగా వీటి పరిధిలో 22, 142 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.

నడిగూడెం : ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో ముసాయిదా ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ యం.మల్సూర్‌నాయక్ విడుదల చేశారు. నడిగూడెం, బృందావనపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, సిరిపు రం, వల్లాపురం, రత్నవరం గ్రామాల వారీగా ఓట రు జాబితా ప్రదర్శించారు. సూపరింటెండెంట్ ఇమామ్, ఎంపీఓ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుపూజోత్సవం



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం గురుపూజోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొణతం సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లోలెవల్' కష్టాలు



పదిరోజుల క్రితం నల్లబండగూడెం-మంగళితండా మధ్య లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద

- భారీ వర్షాలకు లోలెవల్ వంతెనల పైనుంచి వరద
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- బ్రిడ్జి నిర్మించాలని వేడుకోలు

కోదాడరూరల్ : భారీ వర్షాలు కురిసినప్పుడు కోదాడ నియోజకవర్గంలోని పలు వాగులపై గల లోలెవల్ వంతెనల పైనుంచి వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కోదాడ, నడిగూడెం, మోతె, అనంతగిరి మండలాల్లోని లోలెవల్ వంతెనలు, కల్వర్టుల వద్ద ఈ సమస్య తీవ్రంగా ఉంది.



రోడ్డుపై పారుతున్న కోదాడ పెద్దచెరువు అలుగునీరు (ఫైల్)

అంతర్గంగ వాగు ఉప్పొంగి..

కోదాడ మండలం కూచిపూడి వద్ద భారీ వరదలొచ్చినప్పుడు అంతర్గంగ వాగు ఉప్పొంగి నీరు లోలెవల్ వంతెన పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రామాపురం క్రాస్‌వైపు నుంచి మేళ్లచెర్వు మండలం, చింతపాలెం మండలంతో పాటు ఏపీ వైపు వెళ్లే దాదాపు 12 గ్రామాల ప్రజలతో పాటు పలు సిమెంట్ కంపెనీల లారీల రాకపోకలు నిలుస్తున్నాయి. గ్రామం ఎత్తులో ఉండటం వంతెన ఎత్తు తక్కువ ఉండటం, వరదలు వచ్చినప్పుడు ఆ వంతెనకు కంపచెట్లు, చెత్తచెదారం, గుర్రపుడెక్క అడ్డుపడుతుండడంతో నీరు వెనక్కి తన్ని వాగు సమీపంలోని ఇళ్లల్లోకి చేరుతోంది. నల్లబండగూడెం -మంగళితండా గ్రామాల మధ్య ఉన్న ఉలకవాగు పైగల లోలెవల్ వంతెన వరదలకు మునుగుతుండడంతో ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతేకాకుండా ఎగువన ఉన్న కొత్తగూడెం గ్రామ ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు.

రాకపోలకు ఇబ్బందులు

ఇక కోదాడ పెద్దచెరువు అలుగు పోసినప్పుడు ఖానాపురం వైపు ఉన్న కల్వర్టు వద్ద నీరు రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ సమయంలో కోదాడ పట్టణం అనంతగిరి గ్రామాలకు చెందిన దాదాపుగా 15 గ్రామాల మధ్య రాకపోకలు నిలుస్తున్నాయి. అదేవిధంగా మోతె మండలంలోని మామిళ్లగూడెం-విభళాపురం గ్రామల మధ్య గండ్లచెరువు అలుగు, రావిపహాడ్ పెద్దచెరువు అలుగు పోసి రావిపహాడ్ -సిరికొండ గ్రామాల మధ్య రాకపోకలు నిలుస్తున్నాయి. పాలేరు వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు ఉర్లుగొండ- నర్సింహాపురం మధ్య ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తోంది. నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం శివారులో చిన్నవాగు పొంగినప్పుడు వాగుపై ఉన్న లోలెవల్ వంతెన నీటమునిగి నడిగూడెం- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి లోలెవల్ వంతెనలు, కల్వర్టులు ఉన్న ప్రాంతంలో కొత్త బ్రిడ్జిలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



కూచిపూడి వద్ద అంతర్గంగ వాగు ఉప్పొంగినప్పుడు లోలెవల్ వంతెనపై నుంచి భారీ వరదలు వచ్చి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. సమీపంలోని ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. అధికారులు స్పందించి కూచిపూడి వద్ద బ్రిడ్జి నిర్మించాలి.

– శంకశెట్టి కోటేశ్వరరావు, కూచిపూడి

రాకపోకలు నిలుస్తున్నాయి



మంగళితండా- నల్లబండ గూడెం గ్రామాల మధ్య ఉలకవాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు వాగుపై నిర్మించిన లోలెవల్ వంతెనపై నుంచి నీరు వెళ్తోంది. దీంతో వాగు మీదుగా రాకపోకలు సాగించే మూడు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– ధరవత్ బాబ్జీ, మంగళితండా